సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 8 । ఫిబ్రవరి । 2025



టన్ను చీనీ రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు, కనిష్టంగా రూ.7 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.13

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
35.2°/11.4°

జిల్లాలో శుక్రవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

క్వింటా ఎండుమిర్చి రూ.14 వేలు



మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: ఎండుమిర్చి ధర తగ్గుతోంది. శుక్రవారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు 72 క్వింటాళ్ల ఎండుమిర్చి రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. ఇందులో మొదటి రకం ఎండు మిర్చి క్వింటా రూ.14 వేలు, రెండో రకం రూ.8 వేలు, మూడో రకం ఎండుమిర్చి క్వింటా రూ.7 వేల ప్రకారం పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు. గత వారంతో పోలిస్తే క్వింటాపై రూ.1,500 మేర ధర తగ్గింది.

బీఈడీలో 93 శాతం ఉత్తీర్ణత



ఫలితాలను విడుదల చేస్తున్న ఇన్‌చార్జ్ వీసీ అనిత

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో బీఈడీ నాలుగో సెమిస్టర్ ఫలితాలను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత శుక్రవారం విడుదల చేశారు. మొత్తం 630 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా.. 588 మంది పాసయ్యారు. 93 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

బీటెక్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ నాగప్రసాద్ నాయుడు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో 2024 నవంబర్, డిసెంబర్ నెలల్లో నిర్వహించిన బీటెక్ మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–20) రెగ్యులర్, సప్లిమెంటరీ, (ఆర్–19), (ఆర్–15) సప్లిమెంటరీ , రెండో సెమిస్టర్ (ఆర్–20), (ఆర్–19), (ఆర్–15) సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. వివరాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ వి. నాగ ప్రసాద్ నాయుడు శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఫలితాలు జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

ప్రణాళికలు రూపొందించండి: కలెక్టర్

ప్రశాంతి నిలయం: నియోజకవర్గ ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఆర్థిక పురోగతికి సంబంధించిన ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని కోర్టు చాంబర్‌లో ఆయా నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో పీజీఆర్ఎస్, హౌసింగ్ లేఅవుట్లు, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికలు, వివిధ పాఠశాలల విలీన ప్రక్రియ తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ, నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పింఛన్ పంపిణీపై ప్రతి వారం నియోజకవర్గ ప్రత్యేక అధికారులు సంబంధిత అధికారులతో సమీక్షించాలన్నారు.

రేషన్.. పంపిణీ పరేషాన్





ఇది ఎన్పీకుంటలోని పెడబల్లి రోడ్డులో చౌక దుకాణం వద్ద శుక్రవారం కనిపించిన దృశ్యం. సర్వర్ పని చేయక సరుకుల కోసం ఉదయం వచ్చిన కార్డుదారులు మధ్యాహ్నం 2 గంటల వరకూ వేచి చూసి చివరకు వెనుదిరిగారు. ఒక్కో చౌకదుకాణంలో మూడు రోజులు మాత్రమే రేషన్ సరుకులు ఇస్తున్నారు. దీంతో ఆ మూడు రోజుల్లోనే సరుకులు పొందేందుకు కార్డుదారులంతా బారులు తీరుతున్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా ఇలాంటి చిత్రాలే కనిపిస్తున్నాయి.

- నిత్యావసర సరుకుల పంపిణీ అస్తవ్యస్తం
- ఎండీయూ ఆపరేటర్, వీఆర్ఏల అథెంటికేషన్ తప్పనిసరి
- ఒక్కొక్కరికి 3 నుంచి 4 స్టోర్ల కేటాయింపు
- సర్వర్ సమస్యలతో రేషన్ పంపిణీలో తీవ్ర జాప్యం
- పనులు పక్కనపెట్టి రాత్రింబవళ్లు స్టోర్ల వద్ద బారులు
- అరకొర సరుకులతో చేతులు దులుపుకుంటున్న డీలర్లు
- ఇబ్బందులు పడుతున్న పేదలు



చిలమత్తూరులో ఓ రేషన్‌షాపు వద్ద సరుకుల కోసం క్యూలో ఉన్న మహిళలు

1,367	జిల్లాలోని చౌకదుకాణాలు
5,66,108	జిల్లాలోని రేషన్‌కార్డులు
85,100 క్వింటాళ్లు	ప్రతి నెలా కార్డు దారులకు పంపిణీ చేయాల్సిన బియ్యం
3,073 క్వింటాళ్లు	ప్రతి నెలా పంపిణీ చేయాల్సిన చక్కెర

అమడగూరు/ఎన్పీకుంట: చౌకదుకాణాల ద్వారా కార్డుదారులకు అందిస్తున్న నిత్యావసర సరుకుల పంపిణీ జిల్లాలో అస్తవ్యస్తంగా మారింది. రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు ఎప్పుడు ఇస్తారో... ఏమి ఇస్తారో... ఎంతమందికి ఇస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ పంపిణీ విధానం అమలు చేశారు. వృద్ధులు, నడవలేని వారు, స్టోర్‌కు దూరంగా ఉన్న వారు నిర్ణీత తేదీల్లో ఇంటి వద్దనే నిత్యావసర సరుకులు పొందేవారు. దీంతో ప్రతి నెలా 1 వ తేదీ నుంచి 5వ తేదీ లోపు కార్డుదారులందరికీ నిత్యావసర సరుకులు ఇంటికి చేరేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 'ఇంటి వద్దకే రేషన్'ను రద్దు చేసి పాత పద్ధతిలోనే చౌకధాన్యపు దుకాణాల (స్టోర్ల) వద్దకే వెళ్లి సరుకులు తెచ్చుకునేలా చర్యలు చేపట్టింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బియ్యం, చక్కెరతో పాటు కందిబేడలు, వంటనూనె, బెల్లం, రాగులు ఇవ్వగా, కూటమి సర్కార్ మాత్రం కేవలం బియ్యం, చక్కెరతో సరిపెడుతోంది.

లబ్ధిదారుల అగచాట్లు..

జిల్లాలో స్టోర్లన్నీ ఒకేసారి తెరిచి సరుకులు పంపిణీ చేయడం లేదు. ఒక ప్రాంతంలో ఉన్న స్టోర్లలో మూడు రోజులు ఒకటి తెరిస్తే, మరో మూడు రోజులు ఇంకొకటి తెరుస్తున్నారు. ఇలా మూడు రోజులకు ఒక స్టోర్‌లో సరుకులు ఇస్తున్నారు. దీంతో తెరిచి ఉన్న స్టోర్ వద్దకు లబ్ధిదారులు పోటెత్తుతున్నారు. ఈ క్రమంలో రాత్రి వరకైనా సరే గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.

వలస జీవులకు తప్పని ఇబ్బందులు..

బతుకుతెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పరిస్థితి మరీ దారుణంగా మారింది. పనికి సెలవు తీసుకుని సరుకుల కోసం వస్తే వేలిముద్ర వేశాక రెండు, మూడు రోజులు ఉంటేనే సరుకులు అందే పరిస్థితి నెలకొంది. దీంతో వలస జీవులు 2, 3 రోజుల కూలీ నష్టపోతున్నారు.

అథెంటికేషన్‌తోనే అసలు సమస్య..

అమడగూరు మండలంలో 29 చౌకదుకాణాలున్నాయి. 29 షాపుల్లోనూ ఒకేసారి పంపిణీ చేస్తే సమస్య ఉండేది కాదు. 29 డిపోలకు గాను ఎండీయూ వాహనాలకు సంబంధించి ముగ్గురు ఆపరేటర్లకు, మరో ముగ్గురు వీఆర్ఏలకు అథెంటికేషన్ (వేలిముద్ర) ఇచ్చారు. ఒక్కొక్కరికి 5 చౌకదుకాణాలు అప్పగించారు. ఈ ఆరుగురు వేలిముద్రలను వేసి వస్తే పంపిణీ ప్రారంభిస్తారు. ఒక డిపోలో వేలిముద్ర వేసి పంపిణీ ప్రారంభించాక... మధ్యలో కరెంట్ సరఫరా ఆగిపోతే... మళ్లీ వేలిముద్రను వేయాల్సిందే. అంతేకాక ఆ డిపోలో మొత్తం పంపిణీ పూర్తి అయితేనే మరో డిపోకు వెళ్లి వేలిముద్రను వేసే పరిస్థితి నెలకొంది. దీంతో ఒక్కో డిపోలో పంపిణీకి కనీసం మూడు రోజుల నుండి ఆరు రోజుల సమయం పడుతోంది. ఇలా ఒకరికి కేటాయించిన డిపోల్లో పంపిణీ పూర్తి చేయడానికి కనీసంగా 15 రోజులు పడుతోంది. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి పరిస్థితే నెలకొంది.

ఎప్పుడిస్తారో తెలియదు



చౌక దుకాణాల్లో కేవలం బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తున్నారు. అది కూడా ఎప్పుడిస్తారో తెలియడం లేదు. గతంలో ఎప్పుడూ ఇలా సరుకుల కోసం ఇబ్బందులు పడలేదు. వీఆర్ఏలు కాకుండా సంబంధిత డీలర్లే వేలిముద్రను వేసుకునేలా చేస్తే సగం సమస్య పరిష్కారమవుతుంది.

– నవీన్, రెడ్డివారిపల్లి, అమడగూరు మండలం

ప్రతి నెలా ఇబ్బందులే



చౌక దుకాణాల్లో నిత్యావసర సరుకులు తీసుకోవాలంటే ప్రతి నెలా ఇబ్బందే. గత నెలలో సంక్రాంతి పండుగకు కూడా కందిబేడలు ఇవ్వలేదు. స్టాకు తెచ్చుకుని కూడా బ్లాక్‌లో అమ్ముకున్నారు. ఈ నెలలో అసలు సరుకులే ఇవ్వలేదు. వెళ్లి అడిగితే స్టాకు తక్కువ వచ్చిందంటున్నారు. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి.

– లక్ష్మీపతిరెడ్డి, జంబులవాండ్లపల్లి, ఓడిచెరువు మండలం

గతంలో ఆరు రకాల సరుకులు



గతంలో బియ్యం, బెల్లం, వంటనూనె, కందిబేడలు, రాగులు, ఉప్పు ఇచ్చేవారు. ప్రస్తుతం ఇవేమీ లేవు. బియ్యం, అరకిలో చక్కెరతో సరిపెడుతున్నారు. అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. మార్కెట్‌లో ధరలు పెరిగిన నేపథ్యంలో పేదలకు రేషన్ దుకాణాల ద్వారా వంట సరుకులన్నీ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ కూటమి ప్రభుత్వానికి ఇదేమీ పట్టడం లేదు.

– ప్రభావతి, జేకేపల్లి, అమడగూరు మండలం

ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

- మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి
- కాటికేటేశ్వర క్షేత్రంలో పర్యటించిన ఎస్పీ రత్న

తాడిమర్రి: ప్రజా జీవనానికి, ప్రశాంతతకు భంగం కలిగించే వారెవరైనా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ రత్న హెచ్చరించారు. శుక్రవారం ఆమె ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్, ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామ్‌రావ్, సిబ్బందితో కలసి కాటికోటేశ్వర క్షేత్రంలో పర్యటించారు. ఆలయ పరిసరాలను పరిశీలించారు. మహాశివరాత్రి పురస్కరించుకుని రెండురోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాల నిర్వహణపై చిల్లవారిపల్లి గ్రామ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, ఆలయ పూజారితో ఆరా తీశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా వసతి, సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం ఎస్పీ రత్న మాట్లాడుతూ.. ఆలయ గుడికట్టు దారులందరూ ఐకమత్యంతో ఆలయ కట్టుబాట్లు, సంప్రదాయాల ప్రకారం ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. భక్తులకు వాహన పార్కింగ్ ఏర్పాటు చేయాలని ఎస్ఐ కృష్ణవేణిని ఎస్పీ ఆదేశించారు. తిరుగు ప్రయాణంలో తాడిమర్రి పోలీసుస్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. ఎస్పీ వెంట ఎస్పీ ఎస్ఐ ప్రదీప్ కుమార్ ఉన్నారు.



బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌లో మహిళా హెల్ప్ డెస్క్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

పోలీసు వ్యవస్థపై నమ్మకం కలిగించండి

ముదిగుబ్బ/బత్తలపల్లి: వివిధ సమస్యలతో పోలీసు స్టేషన్‌లకు వచ్చే బాధితులకు న్యాయం చేసి పోలీసు వ్యవస్థపై నమ్మకం కలిగించాలని ఎస్పీ రత్న పోలీసులకు సూచించారు. శుక్రవారం ఆమె ముదిగుబ్బ, బత్తలపల్లి, పట్నం పోలీసు స్టేషన్లను తనిఖీ చేశారు. ఆయా స్టేషన్లలో రికార్డులు పరిశీలించడంతో పాటు నమోదు కేసులు, దర్యాప్తు తీరు తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడవద్దని, అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలని సిబ్బందిని ఆదేశించారు. బాధితులు న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారి సమస్యలను సావధానంగా విని న్యాయం చేయాలన్నారు. పోలీసులంతా తప్పనిసరిగా పల్లెనిద్ర చేసి ఆయా గ్రామాల్లోని సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్నారు. బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌లో మహిళా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడాన్ని అభినందించిన ఎస్పీ రత్న... మహిళా కానిస్టేబుల్ లలితతో సెల్ఫీ తీసుకున్నారు. ఎస్పీ వెంట ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్, ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, బత్తలపల్లి, పోతుకుంట ఎస్ఐలు సోమశేఖర్, శ్రీనివాసులు ఉన్నారు.

భూ సేకరణకు రైతులు సహకరించాలి

- జేసీ అభిషేక్‌కుమార్

మడకశిర: పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణకు రైతులు సహకరించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ కోరారు. బాధిత రైతులకు నిబంధనల ప్రకారం మెరుగైన పరిహారం అందిస్తామన్నారు. మడకశిర ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూసేకరణ ప్రక్రియలో భాగంగా శుక్రవారం ఆయన మడకశిరలో పర్యటించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ గ్రామాల రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జేసీ అభిషేక్ కుమార్ భూ సేకరణపై రైతులతో చర్చించారు. పరిశ్రమల స్థాపన నిమిత్తం గతంలో మడకశిర మండల పరిధిలోని ఆర్.అనంతపురంలో 800 ఎకరాలు, గౌడనహళ్లిలో 650 ఎకరాలు సేకరించామని, రైతులకు నష్టపరిహారం కూడా అందించామన్నారు. అయితే ఆయా గ్రామాల్లో గతంలో సేకరించిన భూమికి మధ్యలో ఇంకా కొంత భూమి ఉండడంతో ఆ భూమిని కూడా రైతుల నుంచి సేకరించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. గౌడనహళ్లిలో 36.38 ఎకరాలు, ఆర్.అనంతపురంలో 2.22 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పరిహారం గురించి రైతులతో చర్చించారు. రైతులు పెంచిన వివిధ రకాల చెట్లు, మల్బరీ షెడ్లకు, సాగు చేసిన పంటలకు కూడా పరిహారం ఇస్తామన్నారు. అయితే రైతులు మాత్రం ప్రభుత్వం నిర్ణయించిన పరిహారం తమకు ఏమాత్రం సరిపోదని, ఎకరాకు రూ.20 లక్షల చొప్పున పరిహారం అందించాలని రైతులు కోరారు. లేకపోతే మరోచోట తమకు భూమిని కేటాయించాలని కోరారు. సమావేశంలో పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, సబ్ రిజిస్ట్రార్ కృష్ణవేణి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోని, స్థానిక తహసీల్దార్ కరుణాకరణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

డిగ్రీ కళాశాల కాన్ఫరెన్స్ హాల్ పరిశీలన..

ఈ నెల 10వ తేదీన మడకశిరలో జిల్లా స్థాయి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' మడకశిరలో నిర్వహించనున్న నేపథ్యంలో జేసీ అభిషేక్ కుమార్ శుక్రవారం స్థానిక డిగ్రీ కళాశాలలోని కాన్ఫరెన్స్ హాలును పరిశీలించారు. కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొనే అవకాశం ఉండడంతో స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు.

సింహ వాహనంపై వేంకటరమణుడు



విశేష అలంకరణలో పేట వేంకటరమణస్వామి మూలవిరాట్



కొల్హాపురి లక్ష్మీదేవి సమేతంగా సింహవాహనంపై ఊరేగుతున్న వేంకటరమణస్వామి

హిందూపురం: బ్రహ్మోత్సవాల్లో భాగంగా మెయిన్ బజారులోని పేట వేంకటరమణుడు శుక్రవారం సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం అర్చకులు స్వామివారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం బంగారు కవచాలు అలంకరించి అర్చనలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణస్వామి ఉత్సవ మూర్తులను ఆలయ ముఖమండపంలో కొలువుదీర్చి పూజలు చేశారు. అనంతరం కొల్హాపురి లక్ష్మీదేవి సమేత వేంకటరమణస్వామి ఉత్సవమూర్తులను సింహ వాహనంపై కొలువుదీర్చి మేళతాళాలతో పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పరీక్షా సమయం

జిల్లాలో పరీక్షలు రాస్తున్న వారి వివరాలు

పదో తరగతి విద్యార్థులు
20,061

ఇంటర్మీడియెట్ విద్యార్థులు
23,987

ఇతర పరీక్షలు రాస్తున్న వారు
21 వేల వరకు

- తీవ్ర ప్రభావం చూపుతున్న మొబైల్ అడిక్షన్
- యాజమాన్యాల ఒత్తిళ్లతో విద్యార్థుల్లో మరింత టెన్షన్
- విద్యార్థుల కంటే తల్లిదండ్రుల్లో పెరుగుతున్న ఆందోళన



సాక్షి ప్రతినిధి, అనంతపురం: మరికొద్ది రోజుల్లో వార్షిక పరీక్షలు జరగనున్నాయి. దీంతో విద్యార్థుల కంటే తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పదవ తరగతి మొదలుకొని ఇంటర్, డిగ్రీ ఇలా రకరకాల వార్షిక పరీక్షలు మార్చి నెలలో ఉన్నాయి. ఈ పరీక్షలు ఎలా రాయాలని విద్యార్థులు ఉత్కంఠతో ఉండగా, తల్లిదండ్రులు వీళ్లకంటే ఎక్కువ టెన్షన్ పడుతున్నారు. ఇన్నాళ్లూ చదివింది ఒకెత్తు..ఈ పరీక్షలు ఒకెత్తు.. తమ పిల్లలు మంచి మార్కులు సాధించి పోటీ పరీక్షల్లో విజయం సాధించాలన్న ఆకాంక్షతో తల్లిదండ్రులున్నారు. కానీ తల్లిదండ్రుల్లో ఆందోళన ఉండటానికి కారణముంది.. అదే మొబైల్ అడిక్షన్.

మొబైల్ ఫోన్‌కు ప్రభావితమై..

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 1.80 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ ఏడాది వార్షిక పరీక్షలు రాస్తున్నారు. వీరిలో 50 శాతం మంది ఏదో ఒక సందర్భంలో మొబైల్‌కు ప్రభావితమైన వారే. తల్లిదండ్రులను ఏమరపాటుకు గురిచేసి సామాజిక మాధ్యమాల్లో మునిగితేలిన వారే. దీని ప్రభావం ఇప్పుడు పరీక్షలపై పడనుంది. చివరి నిముషంలో తెలుసుకున్నా ఫలితం లేదు. దీంతో తమ పిల్లలు పరీక్షలు ఎలా రాస్తారోనన్న ఆందోళన తల్లిదండ్రులను వెంటాడుతోంది.

ఒత్తిడితో సతమతం

కొంతమంది విద్యార్థులను మొబైల్ వ్యసనం ఇబ్బంది పెడుతుండగా.. మరోవైపు కాలేజీ యాజమాన్యాల ఒత్తిళ్లు విద్యార్థుల్లో ఉన్న మానసిక స్థైర్యాన్ని కోల్పోయేలా చేస్తున్నాయి. కొన్ని చోట్ల ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఫీజులు కట్టలేదని ఒత్తిళ్లు తెచ్చి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఉదాహరణకు.. పదిహేను రోజుల క్రితం నారాయణ కాలేజీలో ఫీజుల ఒత్తిడి భరించలేక చరణ్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలా ఒత్తిళ్లతో సతమతమవుతున్న విద్యార్థులు చాలామందే ఉన్నారు.



రివిజన్ టైం అని గుర్తుంచుకోవాలి



పరీక్షల సమయం అంటే చదివినవి రివిజన్ చేసుకోవడమే. విద్యార్థులు సెల్ఫ్ ప్రెజర్ వదిలేయాలి. ఎవరికో ఎక్కువ వస్తాయి, నాకు తక్కువ వస్తాయేమో అనేది మనసులోంచి తీసెయ్యాలి. ఈ టైంలో తెల్లవార్లూ చదవాల్సిన అవసరం లేదు. ఆరు గంటల నిద్ర అవసరం. తల్లిదండ్రులు చదవగలవు అన్న ధైర్యమిస్తే చాలు.

– డాక్టర్ విశ్వనాథరెడ్డి, మానసిక వైద్య నిపుణులు, నేషనల్ హెల్త్ మిషన్

క్లుప్తంగా

వివాహిత అనుమానాస్పద మృతి


హిమజ (ఫైల్)

సోమందేపల్లి: మండలంలోని కేతగానిచెరువు గ్రామానికి చెందిన వివాహిత హిమజ(26) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఇంట్లోనే తన శరీరంపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా భర్త ఆదర్శ్ తెలిపాడు. అయితే అనుమానాలు వ్యక్తం చేస్తూ మృతురాలి తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. వివరాలు... నాలుగేళ్ల క్రితం ఆదర్శ్‌కు హిమజాతో వివాహమైంది. వీరికి మూడేళ్ల వయసున్న ఓ కుమారుడు ఉన్నాడు. భర్త సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. హిమజ ఇంటి వద్దనే కిరాణాషాపు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఇంటి వెనుక ఉన్న గది నుంచి పొగలు వస్తుండడాన్ని గమనించిన స్థానికులు అప్రమత్తం చేయడంతో కుటుంబసభ్యులు వెంటనే తలుపులు బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించారు. అప్పటికే మంటల్లో హిమజ కాలి మృతి చెందింది. కాగా, తమ కుమార్తెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మృతురాలి తల్లిదండ్రులు సురేష్, నిర్మల ఆరోపించారు. గ్రామానికి చేరుకుని బంధువులతో కలసి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జ్ డీఎస్పీ ఆదినారాయణ, సీఐ రాఘవన్ అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య


మృతుడు గోవిందరాజులు

కణేకల్లు: వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కణేకల్లు మండలం హనకనహాళ్ గ్రామానికి చెందిన గోవిందరాజులు (40), రామాంజినమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోయినా... ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని గోవిందరాజులు పోషించుకునేవాడు. తమలా పిల్లలు కష్టపడకూడదని భావించిన ఆయన స్థానికంగా పనులు లేకపోవడంతో ఏడేళ్ల క్రితం అనంతపురానికి వలస వెళ్లి చంద్రబాబు కొట్టాలలో అద్దె ఇంట్లో నివాసముంటూ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ వచ్చాడు. పెద్ద కుమార్తె కుసుమను బీటెక్ వరకు చదివించాడు. చిన్న కుమార్తె ఇంటర్ పూర్తి చేసింది. పిల్లల చదువులకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.3 లక్షలకు చేరుకుంది. ఇటీవలే స్వగ్రామానికి తిరిగొచ్చిన ఆయన స్థానికంగానే ఓ యజమాని వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిలోకి చేరాడు. విషయం తెలుసుకున్న వడ్డీ వ్యాపారులు తమ అప్పు తీర్చాలంటూ ఒత్తిళ్లు ఎక్కువ చేయడంతో దిక్కు తోచని గోవిందరాజులు శుక్రవారం వేకువజామున పనికి వెళుతున్నట్లు ఇంట్లో తెలిపి గ్రామ శివారున ఉన్న సంపద తయారీ కేంద్రంలో వెంట తీసుకెళ్లిన తన భార్య చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వైవీఆర్ నీటి విడుదలపై రాజకీయం

కూటమి పార్టీల నాయకుల ప్రచార పిచ్చి పరాకాష్టకు చేరింది. ప్రతి చిన్న ప్రారంభోత్సవాన్ని తామంటే తాము ముందు చేయాలని పోటీ పడి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. తాజాగా ముదిగుబ్బ మండలంలో ఉన్న యోగి వేమన రిజర్వాయర్ నీటి విడుదల అంశాన్ని సైతం ప్రహసనంగా మార్చేశారు.


యోగి వేమన రిజర్వాయర్


కుడి కాలువకు నీటిని విడుదల చేసుకుంటున్న రైతులు

- కూటమి నేతల పబ్లిసిటీ యావకు ఎండుతున్న పంటలు
- మంత్రి సత్యకుమార్ వచ్చే వరకూ ఆయకట్టుకు నీటిని వదలరాదంటూ బీజేపీ నాయకుల హుకుం
- తమ నేతృత్వంలోనే నీరు వదలాలని టీడీపీ నాయకుల అల్టిమేటం
- చేసేది లేక రైతులే స్వచ్ఛందంగా నీటిని విడుదల చేసుకున్న వైనం

ధర్మవరం: నియోజకవర్గ పరిధిలోని యోగి వేమన రిజర్వాయర్ (వైవీఆర్) కుడి, ఎడమ కాలువల కింద 12,800 ఎకరాల ఆయకట్టులో రైతులు సాగు చేసిన పంటలు ప్రస్తుతం కీలక దశలో ఉన్నాయి. ఇలాంటి తరుణంలో వైవీఆర్ కుడి, ఎడమ కాలువల ద్వారా పంటలకు సాగునీటిని విడుదల చేయాల్సి ఉండగా నీటి పారుదల శాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం 1 టీఎంసీ కాగా, ప్రస్తుతం 0.803 టీఎంసీల నీరు ఉంది. దీంతో పంటల సాగుకు నీటిని విడుదల చేయాలంటూ గత నెల రోజులుగా నీటి పారుదల శాఖ అధికారుల చుట్టూ రైతులు తిరుగుతున్నారు. వాస్తవానికి ఈ పాటికే నీటిని విడుదల చేయాల్సి ఉండగా కూటమి నేతలు అడ్డు పడడంతో అంతులేని జాప్యం చోటు చేసుకుంది.

మేమంటే మేము..

వైవీఆర్ ఆయకట్టుకు నీటి విడుదల అంశంపై సంబంధిత శాఖ అధికారులపై కూటమి నేతలు తీవ్ర ఒత్తిళ్లు తీసుకెళ్లి గందరగోళానికి తెరలేపారు. నీటిని మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా విడుదల చేయాలంటూ బీజేపీ నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చారు. సకాలంలో నీటిని విడుదల చేయడం ద్వారా ముదిగుబ్బ మండలంలోని దొరిగిల్లుపెద్ద చెరువు, పాత చెరువు, కొడవండ్లపల్లి చెరువు, చింతకుంటపల్లి చెరువులతో పాటు మార్గ మధ్యంలోని కుంటలు నిండుతాయి. తద్వారా ఆయకట్టు సాగుతో పాటు, భూగర్భజలాలు పెరిగే వీలుంది. వేరుశనగ, ప్రొద్దుతిరుగుడు, జొన్న తదితర పంటలు చేతికి అందే అవకాశం ఉంది. అయితే నీటి విడుదల తమ ఆధ్వర్యంలోనే జరగాలని, లేకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయంటూ మరో వైపు అధికారులపై టీడీపీ నాయకులు బెదిరింపులకు దిగారు. దీంతో రెండు పార్టీల నేతల రాజకీయంతో నెల రోజులుగా నీటి విడుదల అంశం ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారింది. ఈ క్రమంలో కీలక దశలో ఉన్న పంటలు ఎండిపోతుండడంతో రైతుల్లో నానాటికీ అసహనం పెరిగిపోయింది. దీంతో శుక్రవారం ఉదయం కుడి కాలువ తూము గేట్లను రైతులు స్వచ్ఛందంగా ఎత్తి నీటిని విడుదల చేశారు.

నీచ రాజకీయాలు మానుకోవాలి


మీడియాతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

వైవీఆర్ నీటి విడుదల అంశంపై కూటమి నేతలు నీచ రాజకీయాలు మానుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మహదేవ, వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కదిరిప్ప, నాయకులు శ్రీనివాసులు, వెంకటేష్, చిన్నపెద్దన్న హితవు పలికారు. శుక్రవారం వైవీఆర్‌ను పరిశీలించిన అనంతరం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి విడుదల చేయాలని బీజేపీ నాయకులు, కాదు తమ నాయకుడే విడుదల చేయాలని టీడీపీ నాయకులు రాజకీయాలు చేయడం దారుణమన్నారు. సాగునీటి విషయంలో రాజకీయాలు చేయడం ద్వారా రైతులు నష్టపోతారనే విషయాన్ని నాయకులు గుర్తించాలన్నారు. ప్రాంతాల అభివృద్ధి విషయంలో పోటీ పడకుండా నీటి విడుదల విషయంలో ఆధిపత్యం చూపించాలనుకోవడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. వైవీఆర్ నుంచి రైతులే నీటిని విడుదల చేసుకున్నారంటే కూటమి నేతల రాజకీయం ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిజాయితీతో విధులు నిర్వర్తిస్తూ షెడ్యూల్ ప్రకారం ఆయకట్టుకు నీటిని విడుదల చేసే అంశంపై దృష్టి సారించాలని నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు.

పంటలు ఎండిపోతున్నాయి



నెల రోజుల క్రితమే నీటిని విడుదల చేయాల్సి ఉంది. అయితే బీజేపీ నాయకులు అడ్డుకుని మంత్రి సత్యకుమార్ వచ్చి తూము గేట్లు ఎత్తే వరకూ ఆగాలంటూ అడ్డుకుంటూ వచ్చారు. సకాలంలో నీటిని విడుదల చేసి ఉంటే ఈ పాటికే చెరువులు నిండి భూగర్భ జలాలు పెరిగి ఉండేవి. రైతుల విషయంలో నీటి రాజకీయం చేయడం దారుణం.

– రైతు బాలరాజు, గాండ్లవారిపల్లె, ముదిగుబ్బ మండలం

గతంలో ఎన్నడూ చూడలేదు



వైవీఆర్ నీటి విడుదల అంశంపై రాజకీయ చేయడం గతంలో ఎన్నడూ చూడలేదు. మంత్రి వచ్చే వరకూ నీటిని విడుదల చేయకుండా బీజేపీ నాయకులు అడ్డుకోవడం దారుణం. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులు స్పందించి సకాలంలో షెడ్యూల్ ప్రకారం ఆయకట్టుకు నీరందించాలి.

– రైతు రాజారెడ్డి, ఇందుకూరు, ముదిగుబ్బ మండలం

షెడ్యూల్ ప్రకారమే నీటి విడుదల

వైవీఆర్ నీటిని కుడి కాలువ ద్వారా షెడ్యూల్ ప్రకారమే వదులుతున్నాం. కోటా పూర్తయ్యే వరకు ఆయకట్టుకు నీరందించడం జరుగుతుంది. ఇందులో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు చేపడతాం. రైతులు సహనం పాటించాలి.

– కృష్ణకుమార్, ఏఈ, ముదిగుబ్బ మండలం

సేవాలాల్ జయంత్యుత్సవాలకు సంపూర్ణ సహకారం

- ట్రస్ట్ సభ్యులతో అనంత కలెక్టర్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, ట్రస్ట్ సభ్యులు

అనంతపురం అర్బన్: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సంపూర్ణ సహకారం ఉంటుందని ట్రస్ట్ సభ్యులకు అనంతపురం జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్ భరోసానిచ్చారు. సంత్ సేవాలాల్ మహరాజ్ చారిటబుల్ ట్రస్ట్ రూపొందించిన సేవాలాల్ 286వ జయంతి మహోత్సవాల పోస్టర్లను కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం ఆయన విడుదల చేశారు. అనంతరం ఆహ్వాన పత్రికను కలెక్టర్‌కు ట్రస్ట్ సభ్యులు అందించి ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు అశ్వత్థ నాయక్, ప్రధాన కార్యదర్శి బాలానాయక్, కోశాధికారి బానోత్ చక్రేనాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలాజీనాయక్, ఏబీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు రంగానాయక్, పూజారి రంగలాల్‌నాయక్, ఎం.శివశంకర్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదంలో మహిళ మృతి


మృతురాలు గంగమ్మ

చెన్నేకొత్తపల్లి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిన ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం జిల్లా నార్పలకు చెందిన ఈశ్వరయ్య భార్య గంగమ్మ (45) తన కుమారుడు మంజునాథ్‌తో కలసి శుక్రవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై బెంగళూరుకు బయలుదేరింది. చెన్నేకొత్తపల్లి మండలం ఎన్ఎస్ గేట్ సమీపంలోకి చేరుకోగానే అదుపు తప్పి కిందపడడంతో గంగమ్మ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. మంజునాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

అంతర్రాష్ట్ర చైన్‌స్నాచర్ అరెస్ట్

నిందితుడు అన్నమయ్య జిల్లా వాసి

- కర్ణాటక ప్రాంతంలో బైక్ చోరీ
- సహచరుడితో కలసి జిల్లాలో సంచరిస్తూ యథేచ్ఛగా చైన్‌స్నాచింగ్‌లు


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: జిల్లాలో వరుస చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం పుట్టపర్తి డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను నల్లమాడ సీఐ నరేంద్రరెడ్డి వెల్లడించారు. ఇటీవల నల్లమాడ మండలం చెర్లోపల్లిలో ఓ మహిళ మెడలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన దుండగులు అదే రోజు కర్ణాటకలోని బాగేపల్లిలో ఓ మహిళ మెడలో చైన్‌స్నాచింగ్ చేసి మధ్యాహ్నం 1 గంట సమయంలో ఓడీచెరువులోని రెయిన్‌బో స్కూల్ సమీపంలో వివాహిత మెడలోని బంగారు గొలుసునూ లాక్కొని హిందూపురం వైపు ద్విచక్రవాహనంపై ఉడాయించారు. జిల్లాలో చోటు చేసుకున్న రెండు చైన్‌స్నాచింగ్‌లను తీవ్రంగా పరిగణించిన ఎస్పీ రత్న ఆదేశాల మేరకు దర్యాప్తు వేగవంతం చేసిన పోలీసులు శుక్రవారం ఉదయం ఓడీ చెరువు మండలం మహమ్మదాబాద్ క్రాస్ వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడినట్లుగా అంగీకరించాడు. నిందితుడిని అన్నమయ్య జిల్లా మదనపల్లిలోని కోటకొండకు చెందిన చంద్రశేఖర్‌గా గుర్తించారు. అదే జిల్లా తంబళ్లపల్లి మండలం ఏటిగడ్డపల్లికి చెందిన హరికృష్ణతో కలసి ఈ ఏడాది జనవరి 26న కర్ణాటకలోని చింతామణిలో ఓ ద్విచక్ర వాహనాన్ని అపహరించి, వరుస చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడినట్లుగా వివరించాడు. చంద్రశేఖర్ నుంచి 44 గ్రాముల బంగారం, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న హరికృష్ణ కోసం గాలింపు కొనసాగుతోంది. కాగా, నిందితుడు చంద్రశేఖర్ గతంలోనూ ఆరుగురితో కలసి వివిధ జిల్లాల్లో పలు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడినట్లుగా విచారణలో పోలీసులు గుర్తించారు. రాష్ట్రంలోని వివిధ పీఎస్‌ల్లో పది కేసులు ఉన్నాయి. పలు కేసుల్లో జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. ఈ ఏడాది జనవరి 20న మదనపల్లిలోని జైలు నుంచి విడుదలైన అనంతరం పలు ప్రాంతాల్లో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్, సీఐలు నరేంద్రరెడ్డి, శివాంజనేయులు, ఎస్ఐ మల్లికార్జునరెడ్డితో పాటు సిబ్బందిని ఎస్పీ రత్న అభినందించి రివార్డులు అందజేశారు.

లక్ష్యం దిశగా మార్కెట్లు

అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్ శాఖ నిర్దేశించిన లక్ష్య సాధన దిశగా వ్యవసాయ మార్కెట్ కమిటీలు పయనిస్తున్నాయి. 2024–25కు సంబంధించి జనవరి నెలాఖరుకు నిర్దేశించిన రూ.5.31 కోట్లకు గానూ 75 శాతంతో రూ.3.95 కోట్లు వసూలైనట్లు జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ ఎల్ఎన్ మూర్తి తెలిపారు. ధర్మవరం మాత్రమే 50 శాతంతో వెనుకబడి ఉండగా పెనుకొండ, తనకల్లు ఇప్పటికే 100 శాతానికి పైగా సాధించాయన్నారు. గోరంట్ల, హిందూపురం, కదిరి, మడకశిర, పుట్టపర్తి కమిటీల పరిస్థితి మెరుగ్గానే ఉన్నందున ఓవరాల్‌గా 100 శాతం లక్ష్యాన్ని చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక అనంతపురం జిల్లాలోని 9 మార్కెట్ కమిటీలు, 15 చెక్‌పోస్టుల ద్వారా వివిధ రూపాల్లో రూ.12.09 కోట్లు పన్ను వసూళ్ల లక్ష్యంగా పెట్టుకోగా... జనవరితో ముగిసిన 10 నెలల కాలానికి గాను 75 శాతంతో రూ.8.92 కోట్లు సాధించాయి. మొదటి నుంచి దూకుడు కొనసాగిస్తున్న అనంతపురం, శింగనమల మార్కెట్ కమిటీలు నిలకడగానే కొనసాగుతుండగా ఇంతకాలం వెనుకబడిన రాయదుర్గం, తాడిపత్రి మార్కెట్ కమిటీలు కొంత దూకుడును పెంచాయి. రాయదుర్గం మార్కెట్ కమిటీ ద్వారా ఈ ఏడాది రూ.1.44 కోట్లు లక్ష్యం కాగా జనవరి నెలాఖరుకు 89 శాతంతో రూ.1.28 కోట్లు వసూళ్లు జరిగి టాప్ ప్లేస్ చేరుకుంది. ఆ తర్వాత రూ.1.02 కోట్లకు గానూ రూ.82.71 లక్షలు సాధించి 81 శాతంతో శింగనమల రెండో స్థానంలో కొనసాగుతోంది. అలాగే రూ.2.02 కోట్లకు గానూ రూ.1.60 కోట్లతో 80 శాతం లక్ష్యసాధనతో తాడిపత్రి మూడో స్థానం కైవసం చేసుకుంది. అనంతపురం మార్కెట్ కమిటీ ఈ సారి 75 శాతంతో నాలుగో స్థానంలో నిలవడం విశేషం. ఉరవకొండ కమిటీ 52 శాతం, కళ్యాణదుర్గం 58 శాతం, గుత్తి 61 శాతం, గుంతకల్లు 64 శాతం వసూళ్లతో నడుస్తున్నాయి. రాప్తాడు మార్కెట్ కమిటీ ఎలాంటి పురోగతి లేకుండా అన్నిటికన్నా వెనుకంజలో నిలిచింది. ఓవరాల్‌గా తీసుకుంటే ఈ ఏడాది వసూళ్ల పరిస్థితి ఆశాజనకంగానే ఉన్నట్లు ఆ శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి తెలిపారు.

కీర్తి కథ.. కన్నీటి వ్యథ

తల్లి ఒడిలో ఓలలాడాల్సిన చంటి'పాప'.. అంగట్లో సరుకుగా మారింది. ఆడపిల్లగా పుట్టడమే పాపమన్నట్లు కన్నతల్లిదండ్రులే చిన్నచూపు చూశారు. కుటుంబం గడవని స్థితిలో చిన్నారిని అమ్మకానికి పెట్టారు. మానవత్వానికి మాయని మచ్చగా ఈ ఘటన నిలవకుండా చిన్నారిని అక్కున చేర్చుకుంది నాన్నమ్మ. అయినా పసికందును కష్టాలు వీడడం లేదు. తాను రాలిపోయేలోపు ఆ చిన్నారికి ఏదైనా ఆదరవు చూపాలని ఒంటరి పోరు సాగిస్తున్న పండుటాకు ఆశిస్తోంది. ఆ దిశగా మానవతావాదులు స్పందించాలని వేడుకుంటోంది.


బొరుగుల బండిలో చిన్నారిని కూర్చొబెట్టుకుని వెళుతున్న వెంకటలక్ష్మి

- ఆడపిల్లగా పుట్టడమే ఆ చిట్టి తల్లి చేసుకున్న పాపం
- అమ్మకానికి పెట్టిన తల్లిదండ్రులు
- దారుణాన్ని ఎదురించి అండగా నిలిచిన నాన్నమ్మ
- చిన్నారిని ఆదుకునే ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు

అనంతపురం కల్చరల్: సాంకేతికత ఎన్ని కొత్త పుంతలు తొక్కినా ఆడపిల్ల జీవితం ఇంకా మధ్య యుగ భావజాలంలోనే కొట్టుమిట్టాడుతోంది. పుట్టబోయేది ఆడపిల్ల అని తెలియగానే గర్భస్థ దశలోనే చిదిమేస్తున్నారు కొందరు. పుట్టిన తర్వాత రోడ్డు పాలు చేస్తున్నారు మరికొందరు. 'ఆడ పిల్ల ఇంటికి దీపం'.. 'ఆడపిల్లను పుట్టనిద్దాం, ఎదగనిద్దాం, చదవనిద్దాం, బతకనిద్దాం', 'బేటీ బచావో... బేటీ పడావో' నినాదాలు కేవలం రాత'కోతల'కే తప్ప ఆచరణలో ఏ మాత్రమూ కనిపించడం లేదనేందుకు నిదర్శనంగా నిలిచిన ఘటన జిల్లా కేంద్రం అనంతపురంలో వెలుగు చూసింది. యాంత్రిక జీవనంలో సాటి మనిషి గురించి ఆలోచించడమే మానేసిన నేటితరం రోజూ తమ కంటి ముందే కనిపిస్తున్న ఈ దయనీయ చిత్రాన్ని గమనించలేకపోతోంది.

కన్నపేగునే కాదనుకున్నారు

అనంతపురం నగరంలోని పాతూరు మున్నానగర్‌లో నివాసముంటున్న వెంకటలక్ష్మి, బ్రహ్మయ్య దంపతులకు ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. పాతికేళ్ల క్రితం బ్రహ్మయ్య మృతిచెందాడు. ఆ సమయంలో కుటుంబ భారాన్ని నెత్తికెత్తుకున్న వెంకటలక్ష్మి ఊరూరా తిరిగి రెడీమేడ్ దుస్తులు విక్రయిస్తూ పిల్లలను పెంచి పెద్ద చేసింది. అందరికీ పెళ్లిళ్లు అయిన తర్వాత ఎవరి స్వార్థం వారు చూసుకుని తలో దారికి వెళ్లిపోయారు. కన్నతల్లి వీధి పాలైంది. చిన్న కొడుకుకు మొదటి సంతానంగా ఆడపిల్ల పుట్టింది. ఈ క్రమంలో రెండోసారి కొడుకు పుడతాడన్న ఆశతో ఉన్న వారికి భంగపాటు తప్పలేదు. రెండోసారి కూడా ఆడపిల్లే పుట్టేసరికి విపరీతమైన ద్వేషంతో నెలల పసికందును అమ్మేయడానికి తల్లిదండ్రులు సిద్ధపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న నాన్నమ్మ వెంకటలక్ష్మి రగిలిపోయింది. కుమారుడు, కోడలు నిర్ణయాన్ని కాదని పోలీసుల సాయంతో మనవరాలి పోషణ భారాన్ని తీసుకుంది. చిన్నారికి కీర్తి అని పేరు పెట్టి అల్లారుముద్దుగా పెంచుకుంటోంది. ఈ క్రమంలో వయస్సు మీదపడుతుండడంతో తాను కాలం చేసేలోపు చిన్నారికి మంచి భవిష్యత్తు ఇవ్వాలని ఆశిస్తోంది. ఆస్తిపాస్తులేమీ లేక బొరుగుల బండిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఆమె ఆశ కలగా మిగిలిపోకుండా మానవతావాదులు స్పందించాలని వేడుకుంటోంది.

సాయం చేయదలచుకున్న వారు

పేరు	: మగత వెంకటలక్ష్మి
చిరునామా	: మున్నానగర్, పాతూరు, అనంతపురం
బ్యాంకు	: హెచ్‌డీఎఫ్‌సీ, రామనగర్ బ్రాంచ్, అనంతపురం
అకౌంట్ నంబర్	: 5010 073 2231 787
ఐఎఫ్ఎస్సీ కోడ్	: HDFC 0004245
ఫోన్‌నంబర్	: 81254 18450 (ఫోన్ పే లేదు)

ఆడబిడ్డను ఆదుకోండయ్యా



'అయ్యా నా జీవితం ముగిసిపోతోంది. ముగ్గురు కొడుకులు పుడితే వారెవరికీ నా బాగోగులు పట్టలేదు. ఒక్కగానొక్క కుమార్తెను రాజు అనే వ్యక్తికిచ్చి పెళ్లి చేస్తే ఆయన ఊరంతా అప్పులు చేసి భార్యను వదిలేసి వెళ్లిపోయాడు. నా పరిస్థితి చూసి జాలిపడి బ్యాంకు వాళ్లు బొరుగుల బండి పెట్టించారు. డీఈఓ ఆఫీసు పక్క సందులో సోనోవిజన్ కింద బొరుగులమ్ముకుంటూ బతుకుతున్నా. ఈ పాప (మనవరాలు కీర్తి)ను రోడ్డుపాలు చేసి వెళ్లిపోయిన వారు నా బిడ్డలంటే నాకే అసహ్యంగా ఉంది. ఇప్పటికైతే పాపను కంటికి రెప్పలా చూసుకుంటున్నా. నా తర్వాత పాపకు ఎలాంటి కష్టం రాకూడదని ఆ దేవుడికి మొక్కుకుంటున్నా. చుట్టుపక్కల వాళ్లు పాపకు పాలో, తిండో ఇచ్చిపోతుంటారు. పాప పెరిగి పెద్దయి బాగా చదువుకుని జీవితంలో స్థిరపడేలా దాతలు కనికరిస్తే చాలు. సాయం చేయండయ్యా. మీ సాయం వృధా కాకుండా బ్యాంక్‌లో పాప పేరున ఫిక్స్ డిపాజిట్టు చేయిస్తా. లేదా మీరే చేయించండి.'

– వెంకటలక్ష్మి, చిన్నారి నాన్నమ్మ, అనంతపురం